ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
సోమవారం 10 మార్చి 2025

ఉపాధ్యాయుల
పదోన్నతులకు కసరత్తు
● అభ్యంతరాల సవరణకు ప్రత్యేక కమిటీలు
● నేటితో ముగియనున్న పరిశీలనలు 5



కలకడలోని మహల్ బ్రిడ్జి వద్ద బాహుదా నదిలో తోడేసిన ఇసుక

జిల్లాలో కొందరు అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతోందన్న విమర్శలున్నాయి. జిల్లాలోని ప్రముఖ నదులైన మాండవ్యా, బాహుదా నదులు ఇసుకాసురుల చెరలో చిక్కుకున్నాయి. స్థానికంగా ఉండే చెరువులు, కుంటలు, వాగుల సంగతి సరేసరి. రేయింబవళ్లు యంత్రాలతో తవ్వి.. ట్రాక్టర్లతో అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ.. ఓవైపు గొంతు చించుకుంటూ ఉంటే.. మరోవైపు అక్రమార్కులు ఇసుకను అమ్ముకుంటూ.. తమ జేబులు నింపుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక దోపిడీకి ఏమాత్రం తగ్గకుండా ఇసుక తరలిపోతోంది.

అడ్డూ అదుపు లేదు...

● యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా ● మాండవ్యా.. బాహుదాలను చెరపడుతున్న అక్రమార్కులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గం బాలరాజుపల్లె రీచ్ వద్ద నుంచి ఉచిత ఇసుకను ప్రజలకు అందిస్తున్నా.. ఒక్కో లారీ రూ.25 వేల నుంచి రూ.30 వేలకు ధర పెట్టాల్సి వస్తోంది. దూరాన్ని బట్టి ధర ఉంటుండడంతో.. జిల్లాలో కొన్ని మండలాలకు ఇంకా కొంచెం ఎక్కువ పెట్టాల్సి వస్తోంది. దీంతో ప్రజలు విధిలేని స్థితిలో స్థానికంగా ఎవరో ఒకరి దగ్గర ఇసుకను కొనాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ఈ నేపథ్యంలో ఇసుక వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

● గుర్రంకొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా కోసం చెరువులు, కుంటలను తవ్వేస్తున్నారు. మండలంలోని రామానాయుని చెరువు, హరిహరాదుల చెరువులో ఇసుకను ఎక్స్‌కవేటర్‌లతో తవ్వి తరలిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను బయట ప్రాంతాల్లో అమ్ముకుంటున్నారు. దీంతో చెరువుల్లో ఎటు చూసినా గుంతలే కనిపిస్తున్నాయి.

● కురబలకోట మండలంలో ప్రజలు రాజంపేట నుంచి ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్క లారీ 25 వేల నుంచి 30 వేల వరకు ధర చెల్లించాల్సి వస్తోంది. స్థానికంగా కొంతమంది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను చెరువులు, కుంటల నుంచి తెచ్చి అమ్ముతున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ రూ.4 వేల నుంచి 5 వేల వరకు అమ్ముకుంటున్నారు.

● నిమ్మనపల్లె మండలంలో బాహుదా నది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లతో మదనపల్లెకు తరలిస్తున్నారు. ములకలచెరువు మండలంలో పెద్దేరు కాలువ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌లతో కాలువ నుంచి బయటకు తోలి ట్రాక్టర్లతో ఇసుకను తమకు నచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు. యంత్రాలు వినియోగించకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు.

● వాల్మీకిపురం మండలంలో ఇసుక అక్రమ రవాణా వెనుక అధికార పార్టీ నాయకులే ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని టి.సాకిరేవుపల్లె, మాధవరం పల్లె, కూరపర్తి, పట్టణం సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, బయట ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజు వాల్మీకిపురం బైపాస్ గుండా ట్రాక్టర్లలో మదనపల్లె ప్రాంతాలకు ఇసుక అక్రమంగా తరలిపోతోంది.

● చిన్నమండెం మండలంలో మాండవ్యానది నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. రైతులు సైతం తమ పంట పొలాల దగ్గర ఉన్న ఇసుకను ఒక ట్రాక్టర్‌కు 200 చొప్పున ఇస్తేనే మాండవ్యా నదిలో ఇసుకను తీసుకెళ్లనిస్తున్నారు. రేయింబవళ్లు తీరిక లేకుండా కేశాపురం నుంచి మల్లూరు, వండాడి, గొర్లముదివీడు వరకు రోజూ వందలాది ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తూ ఉన్నాయి. ఆదివారం ఇలాగే ఇసుక కోసం వచ్చిన ఓ ట్రాక్టర్ బోల్తాపడడంతో.. ఒకరు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు.



గుర్రంకొండ హరిహరాదుల చెరువులో ఇసుక తరలించగా మిగిలిన గుంతలు

● పెద్దతిప్పసముద్రం మండలంలో పాపాఘ్ని నదిలో ఇసుక దొంగలు పడ్డారు. మండలంలోని టి.సదుం గ్రామం పాపాఘ్ని నదిలో కొందరు చోటామోటా నాయకులు ఇతర గ్రామాల నుంచి ట్రాక్టర్లను రప్పించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. గతంలో వైసీపీ వాళ్లు చేసిన పాపాలే ఈ ప్రభుత్వంలోనూ.. చేస్తున్నారనే విమర్శలు జోరుగా ఉన్నాయి.

● రాజంపేట మండల పరిధిలో నందలూరు, రాజంపేట బాహుదానది పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తోంది. ఇక్కడ కూడా కొందరు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే విధంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల పర్యవేక్షణా లోపం కారణంగా కేటాయించిన క్వారీలలో కాకుండా.. ఇష్టానుసారం ఇసుకను యంత్రాలతో డంపింగ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● కలికిరి మండలంలో బహుదా నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అయితే అదే సమయంలో కొందరు అక్రమంగా పీలేరు, మదనపల్లెకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● కేవీ పల్లె మండల పరిధిలోని మహల్ బ్రిడ్జి వద్ద ఉన్న బాహుదా నదిలో అక్రమార్కులు ఇష్టానుసారం ఇసుకను తోడేస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పీలేరు, కలకడ మండలాలతో పాటు సమీప గ్రామాలకు అక్రమంగా ఇసుకను చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అక్రమార్కులు రాజకీయ అండతో రెచ్చిపోతూ.. దాడులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వీరబల్లి మండలంలోని మాండవ్యా నదిలో రోజూ ఇసుకను తరలిస్తున్నారు. వారం రోజుల కిందట సమీప గ్రామస్థులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ప్రస్తుతానికి ఇసుక రవాణాను నిలిపేశారు. రాగిమానుదిన్నెపల్లె, వెలకచెట్టుపల్లె సమీపంలోని నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

● సుండుపల్లె మండలంలోనూ బాహుదా నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఈ అక్రమ రవాణా వెనుక అధికార పార్టీ నాయకులే ఉండడం గమనార్హం.

● రాయచోటి మండలంలోని మాండవ్యా నదిలోనూ ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరస్తున్నారు. పట్టపగలే ఎటువంటి భయం లేకుండా రాయచోటి పట్టణానికి తరలిస్తూ.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నది నుంచి ఇసుక తరలిస్తూ...

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

చిన్నమండెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరుకు చెందిన ఉస్మాన్ బాషా కుమారుడు రఫీ (34) ఇసుక తరలిస్తూ అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పది సంవత్సరాలుగా ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని శ్రీమండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వెనుక ఉన్న మాండవ్యనదిలో ఆదివారం ట్రాక్టర్‌లో ఇసుకు పోసుకుని వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడగా దాని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ట్రాక్టర్ కింద ఉన్న రఫి మృతదేహం

పెద్దశేష వాహనంపై లక్ష్మీనరసింహుడు

గుర్రంకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు తిరుచ్చి, పెద్దశేష వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను వేదపండితులు నిర్వహించారు.



పెద్దశేష వాహనంపై నరసింహస్వామి

అనంతరం తిరుచ్చి వాహనంపై స్వామి వారిని ఉంచి పూజలను చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పెద్ద శేషవాహనంపై గ్రామ పురవీధుల్లో స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, నరసింహ, ధనుష్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారు తిరుచ్చి వాహనంపై, సాయంత్రం గజ వాహనంపై ఊరేగనున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు భక్తుల నడుమ కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై అలంకరణలు చేసి పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు ధనుష్‌భట్టార్, గోకుల్‌భట్టార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంగమ్మ జాతరలో జనసందోహం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జాతర ముగిసిన నాలుగు ఆదివారాలు ఈనెలాఖరు వరకు ప్రతి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సర్వదర్శనంతో పాటు ప్రత్యేక క్యూలైన్లు కూడా భక్తులతో నిండిపోయాయి. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు దాతలు, భక్తులు మంచినీటితో పాటు పాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలువురు అన్నదానాలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, దినేష్‌యాదవ్‌లు అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్?

● విధుల నుంచి ఇన్విజిలేటర్ తొలగింపు?

కలికిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న కలికిరి జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో ప్రారంభం నుంచి మాస్ కాపీయింగ్ భారీగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీషు, జూనియర్ ఇంటర్ లెక్కలు పరీక్షల వరకు ఇన్విజిలేటర్లు కూడా మాస్ కాపీయింగ్‌ను బాగా ప్రోత్సహించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం జూనియర్ లెక్కల పరీక్ష సందర్భంగా ఒక ఇన్విజిలేటరు పరీక్ష జరుగుతున్న గదిని విద్యార్థులకే అప్పగించి బయటకు వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. శబ్దం లేకుండా పని పూర్తి చేసుకోవాలని, స్క్వాడ్ వస్తే తాను బయట ఉండి అప్రమత్తం చేస్తానని చెప్పి పరీక్ష జరుగుతున్న గదిని విడిచిపెట్టి వెళ్లినట్లు ఆరోపిస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రంలో కలికిరిలోని రెండు ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులతో పాటు, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తున్నారు. పలువురు విద్యార్థులు పరీక్ష అనంతరం తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ విధమైన మాస్ కాపీయింగ్ జరిగితే తాము కష్టపడి చదివీ ప్రయోజనమేముందని మెరిట్ విద్యార్థులు నిలదీసినట్లు తెలుస్తోంది. ఈ గొడవ ఉన్నతాధికారులకు తెలియడంతో పరీక్షా కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు కేటాయించిన సీటింగ్ విధానంపై అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. మాస్ కాపీయింగ్‌కు కారణమైన ఒక హైస్కూల్ ఉపాధ్యాయుడిని ఇన్విజిలేటర్ విధుల నుంచి తప్పించినట్లు తెలిసింది. లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ విద్యార్థులు ఒకే గదిలో పరీక్షలు రాయకుండా జంబ్లింగ్ విధానంతో సీటింగ్ మార్చాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆ మేరకు చర్యలు చేపట్టారు. ఆదివారం సెలవు అనంతరం మిగిలిన పరీక్షలు సోమవారం నుంచి శనివారం వరకు జరగనున్నాయి.



చీఫ్ సూపరింటెండెంట్ వివరణ

దీనిపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వై.బాలాజీ (కేవీ పల్లె మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్)ను వివరణ కోరగా ఒక ఇన్విజిలేటర్ పరీక్ష గది నుంచి బయటకు వెళ్లింది వాస్తవమేనన్నారు. దీనిని గమనించి కారణం అడగ్గా ఒకసారి మంచి నీళ్ల కోసం, మరోసారి వాష్ రూం కోసం వెళ్లినట్లు చెప్పారన్నారు. ఇలాగైతే ఇన్విజిలేషన్‌కు రానవసరం లేదని వార్నింగ్ ఇచ్చిన మాట కూడా వాస్తవమేనన్నారు. హై పవర్ కమిటీ సభ్యులు బాలకృష్ణమూర్తి కూడా పరీక్షా కేంద్రాన్ని సందర్శించారని, సీటింగ్ ఏర్పాట్లు సరిదిద్దాలని సూచించిన మాట కూడా వాస్తవమేనని చెప్పారు. డీఈవో కూడా పర్యవేక్షించారన్నారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనల పైన ఉదాసీనంగా వ్యవహరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్ నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, విద్యార్థులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

రాయచోటిలో 144 సెక్షన్

రాయచోటిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల వీరభద్రుడి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన పార్వేట ఉత్సవం వద్ద చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 144 సెక్షన్‌ను అమలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సీఐ తెలిపారు. ఎక్కువ మంది ఎక్కడా గుమికూడి ఉండకూడదని, గుంపులు గుంపులుగా ఉంటే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

● ఏప్రిల్ 11న జరిగే కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు
● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



మహాసంప్రోక్షణలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు

రాజంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, ఏప్రిల్ 11న జరిగే కోదండరాముని కల్యాణోత్సవానికి చురుగ్గా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఒంటిమిట్ట కోదండరామాలయ బ్రహ్మోత్సవాల నిర్వహణపై పరిపాలనా భవనంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ, జిల్లా అధికారులతో ఆదివారం సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్టలో జరిగే కల్యాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. టీటీడీ అధికారులు, సిబ్బంది, కడప జిల్లా అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని, భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కల్యాణోత్సవం రోజున విద్యుత్ అంతరాయం కలగకూడదన్నారు. అవసరమైన జనరేటర్‌లను కూడా సిద్ధం చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహ్వాన పత్రికలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు తాగునీటి సమస్య, అన్నప్రసాదాలు, నిత్యావసర సేవలు, అవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు. అంతకు ముందు కల్యాణవేదిక ప్రాంగణాన్ని చైర్మన్ పరిశీలించారు. కల్యాణవేదిక ప్రాంగణాన్ని బాగా అలంకరించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణపై జేఈవో వీరబ్రహ్మం టీటీడీ చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

15న అమరావతిలో శ్రీనివాస కల్యాణం

అమరావతిలోని వెంకటపాలెంలో ఈనెల 15న శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమరావతిలోని టీటీడీ వెంకటేశ్వరాలయంలో తొలిసారి శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు తగ్గట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను వేద పండితులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మహా సంప్రోక్షణ ఉత్సవాల్లో చైర్మన్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
రాయచోటి	6.29	5.05
మదనపల్లె	6.31	5.12
రాజంపేట	6.27	5.13
పీలేరు	6.29	5.05

పులుల గణన కోసం 128 కేంద్రాలు ఏర్పాటు

● ఫారెస్ట్ రేంజర్ కళావతి

సిద్దవటం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పులుల గణన కోసం సిద్దవటం రేంజ్‌లో 128 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు పులుల గణన కోసం సిద్దవటం రేంజిలోని 64 స్థానాల్లో ఒక్కో స్థానంలో 2 కేంద్రాలు చొప్పున 128 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24న, ఏప్రిల్ 13న సీసీ కెమెరాల డేటా సేకరిస్తామని తెలిపారు.



అటవీ ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

జీఎస్‌ఓసీ ఇంటర్న్‌షిప్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్న అజాద్ గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ (జీఎస్‌ఓసీ) ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సమర్పించిన వేలాది ప్రాజెక్టులలో అజాద్ ప్రాజెక్టు ప్రత్యేకంగా నిలిచిందన్నారు. టాప్ 1000 ప్రాజెక్టులలో ఒకరిగా నిలిపిందన్నారు. అజాద్ తన సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడమే కాకుండా రూ.2,50,000 స్టైఫండ్ అందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్, సీఎస్ఈ హెచ్ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాష్‌లు అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

పులివెందుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం నిర్వహించిననృత్య ప్రదర్శనలు అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్య వేక్షణ వేంపల్లెకు చెందిన సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్ చిన్నారులు శబరీష్ డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. శాస్త్రీయ, జానపద, సినిమా పాటలకు నృత్యాలతో పాటు లైక్వాండో ప్రదర్శన నిర్వహించారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు కసరత్తు

● అభ్యంతరాల సవరణకు ప్రత్యేక కమిటీలు
● నేటితో ముగియనున్న పరిశీలనలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో నమోదు చేసుకున్న వివరాల ఆధారంగా తాత్కాలిక సీనియారిటీ జాబితాలను ప్రకటించింది. ఇందులో అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీ లోగా ఫిర్యాదు చేసి సవరించుకోవాలని విద్యాశాఖ తెలిపింది. ఇందులో భాగంగానే గత మూడో తేదీ నుంచి ప్రతిరోజు సాయంత్రం మూడు నుంచి ఏడు గంటల వరకు ప్రత్యేక కమిటీలు పనిచేస్తూ ఉన్నాయి. వివరాలు పరిశీలిస్తే... జిల్లా స్థాయి కమిటీలో పాత జిల్లా కేంద్రం విద్యాశాఖ అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తూ పాత జిల్లా కేంద్ర ఏడీ మెంబర్ కన్వీనర్ గాను, కొత్త జిల్లా కేంద్రం ఏడీ, పాత కొత్త జిల్లాల సూపరింటెండెంట్లు సభ్యులుగా ఉంటూ కేడర్ వారీగా పరిశీలన కోసం ఉప విద్యాశాఖ అధికారి, డీసీఈబీ సెక్రటరీ, సీనియర్ హెడ్మాస్టర్ ప్రత్యేక కమిటీలుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను జిల్లా స్థాయి కమిటీలు అప్పటి కప్పుడే పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి కమిటీ నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పీల్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. జిల్లా ఫిర్యాదుల పరిష్కార కమిటీ ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈనెల 10వ తేదీ వరకు పని చేస్తుంది. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారుచేస్తారు. సాధారణ సీనియారిటీ జాబితా డీఎస్సీలోని మెరిట్ ర్యాంకు ఆధారంగా, సబార్డినేట్ సర్వీస్ రూల్ 33 ప్రకారం తయారు చేస్తారు. పదోన్నతుల సీనియారిటీ జాబితా రోస్టర్ కం మెరిట్, అడక్వసీ ఆఫ్ ప్రమోషన్ రిజర్వేషన్స్ నిబంధనల మేరకు సబార్డినేట్ సర్వీస్ రూల్ 20ని ఆధారంచేసుకొని తుది రూపు తీసుకువస్తారు.

ర్యాంకుల జాబితా ప్రకటించాలి



ఇప్పటి వరకు జరిగిన అన్ని డీఎస్సీల బ్యాచ్‌లు, ఉపాధ్యాయుల వారీగా మెరిట్ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. సీనియారిటీ జాబితాలో ఉపాధ్యాయులకు చెందిన ర్యాంకుల వివరాలు ఇచ్చినా, స్పష్టత కోసం డీఎస్సీ వారీ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. రోస్టర్ ర్యాంకు, మెరిట్ ర్యాంకు వివరాలపై స్పష్టతను ఇవ్వాలి. ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించిన డీఎస్సీ మెరిట్ ర్యాంకుతో పాటు మార్కుల వివరాలు తెలపాలి. గతంలో మాదిరి పదోన్నతులు ఇచ్చే ఖాళీల సంఖ్యకు మూడు రెట్లు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సంసిద్ధం చేసే మాదిరిగా ముందుకు సాగాలి. ఫైనల్ సీనియారిటీ జాబితాలు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రకటించాలి.

- సి.వి ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

సాధారణ తాత్కాలిక, సీనియారిటీ జాబితాలో తికమకలు

రాష్ట్ర ఆదేశాలను అనుసరిస్తూ జిల్లా విద్యాశాఖ సాధారణ తాత్కాలిక సీనియారిటీ జాబితాలను విడుదల చేసింది. వీటిని జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలను తెలపాలంటూ ప్రకటనలు కూడా విడుదల చేసింది. సీనియారిటీ జాబితాను పరిశీలించిన మీదట టీఐ ఎస్‌లో కులాల కేటగిరీలు ఖచ్చితంగా నమోదు చేసిన కొంత మంది ఉపాధ్యాయుల పేర్లు తాత్కాలిక సీనియారిటీ జాబితాలో వేరుగా నమోదైనట్లు తెలుస్తోంది. డీఎస్సీల వారీగా ర్యాంకుల జాబితాలు అన్ని బ్యాచులకు అందుబాటులో లేకపోవడం వల్ల సీనియారిటీ నిర్ణయించడంలో కొన్ని ఇబ్బందులు చోటుచేసు కున్నాయి. కొన్ని డీఎస్సీల వారీ నియామక పత్రాలతో ర్యాంకును నమోదు చేయక పోవడంతో కూడా సమస్య ఉత్పన్నమవుతోంది. అదే మాదిరిగా ప్రతి డీఎస్సీకి సంబంధించిన ఖచ్చితమైన రికార్డులు విద్యా శాఖ వద్ద లేకపోవడం చర్చనీ యాంశమైంది. గతంలో డీఎస్సీల రికార్డులన్నీ జిల్లా పరిషత్ ఆధీ నంలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా భావించాల్సి వస్తోంది. డీఈఓ ఆధీనంలో నిర్వహించిన డీఎస్సీల ఉపాధ్యాయులకు నియామక పత్రాలలో ర్యాంకులను నమోదు చేసినా అది రోస్టర్ ర్యాంకా? మెరిట్ ర్యాంకా? అన్న దానిపై స్పష్టత లేదు. దీనితో సీనియారిటీ జాబితాలో ర్యాంకుల నమోదుపై పలు అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. 1996 మూడవ బ్యాచ్‌కు అసలు ర్యాంకులే లేనందున ఉన్నత ర్యాంకు ఉన్నవారికి అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదు. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారు చేస్తారు. జిల్లా విద్యా అధికారి ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల పదోన్నతులకు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెడ్‌మాస్టర్ పోస్టులకు పదోన్నతులకు అధికారిగా ఉంటారు.



డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు

పదోన్నతులపై అనుమానాలు

పదోన్నతులపై ఉపాధ్యాయులకు పలు అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల మిగులు ఏర్పడుతున్న సందర్భంలో పదోన్నతులకు ఖాళీలు ఎక్కడున్నాయని చర్చలు సాగుతున్నాయి. మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే నిబంధనలు వెలువడిన తర్వాత మాత్రమే పదోన్నతులపై స్పష్టమైన వివరాలు అందే అవకాశం ఉంది. దీనిపై మెగా డీఎస్సీ కూడా ఆధారపడి ఉంటుందని తెలుస్తుంది. స్పష్టమైన సర్దుబాటు నిబంధనలు విడుదల చేయాలని కూడా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కామేశ్వరుడిని తాకిన భానుడి కిరణాలు



స్వామి పీఠంపై సూర్యకిరణాలు

వాల్మీకిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో ఉన్న లక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేక సమయంలో సూర్య కిరణాలు స్వామివారి పీఠాన్ని తాకాయి. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు పూజలు చేసి తన్మయం చెందారు. అర్చకుడు గోన వరపు శీనాస్వామి కామేశ్వరస్వామికి పూజలు చేశారు.

12న మల్లయ్యకొండ ఆలయ హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన హుండీలోని కానుకలను ఈ నెల 12న లెక్కించనున్నట్లు ఈవో మునిరాజ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు (ఫిబ్రవరి 27)న తాత్కాలిక హుండీ , సేవా టికెట్లు, కల్యాణోత్సవం చదివింపులు, చందాల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5,08,918లు ఆదాయం వచ్చింది. అదే రోజున నిర్వహించాల్సి ప్రధాన హుండీ లెక్కింపు అనివార్య కారణాలతో వాయిదా పడిందని ఈవో తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

●రూ. 3.24లక్షలు స్వాధీనం ● కానిస్టేబుల్‌పై కేసు నమోదు
● మరికొందరు అధికారులపై అంతర్గత విచారణ

రాయచోటిటౌన్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి:) జూదగృహంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.3.24 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు ఈ జూదగృహం నిర్వహణలో రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారులోని సుండుపల్లె మార్గంలో ఉన్న టిడ్కో ఇళ్లలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో.. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేసి, మోహన్ అనే వ్యక్తితోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాలకు చెందిన 10 మందిని అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. సదరు కానిస్టేబుల్‌పైనా కేసు నమోదు చేసినట్లు సమాచారం. జూదం ద్వారా సంపాదించే మొత్తంలో కొందరు పైస్థాయి అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. మామూళ్లు తీసుకుని.. జూదం నిర్వహించుకోవడానికి సహకరిస్తున్న ఆయా అధికారులపైనా ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ... 11 మంది జూదరులను అరెస్టు చేశామన్నారు. కానిస్టేబుల్‌పైన ఇంకా కేసు నమోదు చేయలేదని, విచారణ జరుగుతోందన్నారు. జూదం నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తనకు మామూళ్లు ఇచ్చారనడం వాస్తవం కాదన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. కూలీలకు గాయాలు



సంఘటనా స్థలంలో లారీ, ఆటో

పులివెందుల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో 12 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం పట్టణ సమీపంలోని చిన్న రంగాపురం గ్రామం వద్ద గల ఫుడ్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద అరటికాయల లోడుకు వెళుతున్న ఢిల్లీ లారీ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలోని 12 మంది కూలీలు గాయపడ్డారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ నుంచి కూలి పని నిమిత్తం 12 మంది ఇప్పట్ల గ్రామానికి వెళుతుండగా చిన్నరంగాపురం వద్ద వెనక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొంది. దీంతె ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కంపచెట్లలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ ఎన్వీ రమణ, ట్రాఫిక్ సీఐ హాజీవలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణంలో చోరీ..



సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుడి చిత్రం

వాల్మీకిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం తాళాలను పగులగొట్టి లోనికి చొరబడారు. రూ.33 వేలు, పలు మద్యం బాటిళ్లు అపహరించుకు పోయారు. ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని శ్రీనివాసులు చోరీ విషయాన్ని గమనించి ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ సమర్పించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై దాడి .. ఐదుగురిపై కేసు

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై దాడి చేయడంతోపాటు ఫోన్‌లో దూషించారంటూ మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన భూమిరెడ్డి విజయభారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవీ రమణ, భానుకిరణ్, శివతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. రెండు రోజుల క్రితం సాయినగర్‌లో భూమిరెడ్డి విజయభారతి ఉన్న ఇంటి వద్దకు వెళ్లి తలుపులను గట్టిగా తట్టారని, ఆమె భర్త శ్రీనాథ్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తనను శ్రీనాథ్ రెడ్డి ఫోన్‌లో బెదిరించడంతోపాటు, అసభ్య సందేశం పెట్టాడంటూ శివ కూడా ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కలసపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిసిద్దుపల్లెలో కోనేటి సునీల్ (24) అనే యువకుడు ఆదివారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య కుమారుడు సునీల్ ఇటీవలే వరికోతయంత్రం కొనుగోలు చేశాడు. అయితే, దాని విషయం పట్టించుకోకుండా ఎక్కువ సమయం సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ కాలం గడుపుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కలసపాడు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

నేడే చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

● సినీ నటి కీర్తి సురేష్ రాక



కడప (మారుతీనగర్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్‌గేట్ ఎదురుగా సోమవారం చెన్నయ్ షాపింగ్ మాల్ 29వ బ్రాంచ్ ప్రారంభం కానుంది. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో విస్తరించిన చెన్నయ్ షాపింగ్‌మాల్ కడప నగరవాసులకు నేటి నుంచి పరిచయం కానుంది. నాణ్యమైన దుస్తులు, లేడీస్ ఫ్యాన్సీ ఐటమ్స్ అందించేందుకు షాపింగ్‌మాల్ సిద్ధమైంది. ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రజలు చెన్నయ్ షాపింగ్ మాల్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో తిరుపతికి వెళ్లి కొనుగోలు చేసే వారు. నేడు కడప నగరానికి చెన్నయ్ షాపింగ్ మాల్ రావడంతో ప్రజలు మాల్ ప్రారంభం కోసం ఆసక్తిగా చూస్తున్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. మాల్‌లో రూ.99కే మహిళలకు చీరలు దొరుకుతాయని ప్రచారం చేయడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మొదటిరోజు షాపును సందర్శించే అవకాశం ఉంది.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

సీకేదిన్నె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర మొదటి ఆదివారం సందర్భంగా భక్తులు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లో మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

రామసముద్రం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మట్లవారిపల్లెలో ఆదివారం ఉజ్జనేశ్వర, శిగరేశ్వర, బీరేశ్వర, బత్తేశ్వర శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడుకు చెందిన కురబ కుల భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పొలిమేరల్లో టెంట్లు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ప్రతి 14 ఏళ్లకు ఒకసారి కురబ సంఘాల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వందల సంఖ్యలో కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు రావడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రామసముద్రం-మదనపల్లె వెళ్లే బస్సులను ఆర్.నడింపల్లె, చెంబకూరు మీదుగా మళ్లించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూజలు చేయించారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

● ఆరు పదుల వయసులో ఆత్మీయ సమావేశం
● కోవరంగుట్టపల్లిలో పూర్వ విద్యార్థుల కలయిక



కోవరంగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1974-75లో పదవ తరగతి చదివిన విద్యార్థులు

సింహాద్రిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వారంతా ఆరు పదుల వయసు దాటిన వారు. యాభై ఏళ్లప్పుడు పదో తరగతి చదివారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ కలసి తాము చదువుకున్న కోవరంగుట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కలిశారు. 1974-75 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 37 మంది ఆ విద్యార్థులు అప్పటి సంఘటనలు నెమరువేసుకున్నారు, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ రోజు ఎన్నటికీ మరువలేమని చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసు కుంటామని కలలో కూడా ఊహించలేదని పలువురు మాట్లాడారు. గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. రిటైర్డ్ హెచ్ఎం రామలింగారెడ్డిని తుమ్మల పల్లి సూరుడు సన్మానించారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మధుసూదనశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పాఠశాల స్థలదాత వారసుడు మండల మాజీ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్‌రెడ్డి, మానవతా సేవా సమితి అధ్యక్షుడు కొండారెడ్డి, పాఠశాల హెచ్ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేశారు.

ప్రాణాలు బలిగొన్న రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

అన్నమయ్య జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయాలపాలయ్యారు.



ఓబులవారిపల్లె : సంఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

ఓబులవారిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట పంచాయతీ పెరియవరం గ్రామానికి చెందిన అందె వెంకటేశ్(26) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న తన మేనల్లుడు విజయ్‌ను చూడడానికి ఆదివారం బైక్‌పై కొర్లకుంటకు వచ్చాడు. స్కూల్లో అనుమతి తీసుకుని తన అల్లుడితోపాటు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బొమ్మవరం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న అతని అల్లుడు విజయ్ గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అందుబాటులో లేకపోవడం తిరుపతికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి బంధువులకు సమాచారాన్ని అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడు విజయ్

విద్యార్థి దుర్మరణం...

మదనపల్లె అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, శివాజీ నగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు ఉదయ్‌కిరణ్(20) శనివారం రాత్రి పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మిత్రులతో కలసి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం బైక్‌పై తిరిగి వస్తూ కనుమలో గంగమ్మ ఆలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న బంకును ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

యువతను నమ్మించి మోసగించడం భావ్యమా?

వేంపల్లె,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యమా అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీ నిరుద్యోగ భృతి అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు చొప్పున తమ ప్రభుత్వం ఇస్తుందని సూపర్‌సిక్స్ హామీలలో పేర్కొన్నారన్నారు. దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులకు ఏడాదికి దాదాపు రూ.7200 కోట్లు విడుదల చేయాలన్నారు. కానీ 2024-25 బడ్జెట్‌లో, 2025-26 బడ్జెట్‌లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి అయిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

జ్యోతి దేవాలయంలో పురాతన శాసనం



జ్యోతి సిద్దేశ్వర ఆలయ ప్రాంగణంలో గుర్తించిన శాసనం

సిద్దవటం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతి గ్రామంలో ఉన్న జ్యోతిలింగేశ్వర, సిద్దేశ్వ స్వామి దేవాలయానికి దక్షిణంగా ఉన్న మండపం అడుగు భాగాన మరో శాసనం వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రి సందర్భంగా దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్యక్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి మురికినాటి శ్రీనివాసులు ఇక్కడున్న శివలింగాలను, మండపాన్ని సందర్శించారు. ఈ క్రమంలో మండపం ఫ్లో రింగుపై శాసనాన్ని కనుగొన్నారు. దీనిని ఫొటో తీసి బెంగుళూరు మైసూరు లో ఉన్న భారత పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.మునిరత్నంరెడ్డికి పంపగా ఆయన పరిశీలించారని వారు తెలియజేశారు. ఇలాంటి ప్రాచీన చరిత్ర కలిగిన శాసనాలకు రక్షణ కల్పించాలని కోరారు.

కడప ఉక్కుసాధన ఉద్యమానికి సన్నద్ధం కావాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు మరోమారు ఉద్యమానికి సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రూ.3.22లక్షలకోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50,65,345 బడ్జెట్‌లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావనే చేయక పోవడం సర్కారు దగాకోరుతనాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమాన్ని ఈనెల 10న సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



బోరెడ్డిగారిపల్లెలో అమ్మవారికి బోనాలు పడుతున్న భక్తులు

గాలివీడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరెడ్డిగారిపల్లె పంచాయతీ ప్రజలు ఆదివారం గంగమ్మకు ప్రత్యేక బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర అనంతరం వచ్చే ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో భాగంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

పౌల్ట్రీ ఫారం మూసివేత



గాలివీడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలతో గ్రామ సభ తీర్మానం మేరకు పౌల్ట్రీ ఫారంను మూసివేస్తున్నట్లు గోరాన్‌చెరువు పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాసరివాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫారం ద్వారా వెలువడే వ్యర్థాలు, దుర్వాసనతో స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారన్న ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 25వ తేదీన గ్రామసభ నిర్వహించి తీర్మానం చేశారని, ఈ మేరకు కోళ్ల ఫారంను మూసివేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఉపాధి హామీ ఆడిట్ సిబ్బందిపై దౌర్జన్యం?

పుల్లంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలో ఉపాధిహామీలో జరిగిన పనులపై జరుగుతున్న సోషల్ ఆడిట్ సిబ్బందిపై ఫీల్డ్ అసిస్టెంట్ దౌర్జన్యానికి దిగినట్లు తెలిసింది. తాము పనులు చేయలేదని, కూలి డబ్బులు కూడా తమకు ఇవ్వలేదని, ఉపాధి కూలీలు ఆడిట్ సిబ్బందికి వివరిస్తుండగా ఇంతలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆడిట్ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. గతంలో కూడా ఉపాధిహామీలో ఈ పంచాయతీలో అక్రమాలు జరిగాయని తెలుగుదేశం నాయకులు అధికారులకు ఫిర్యాదు కూడా చేసి ఉన్నారు.

లారీ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

పుల్లంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుత్తనవారిపల్లె చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి లారీ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఓబులవారిపల్లె మండలం అయ్యలరాజుపల్లెకు చెందిన గౌరి తమలపాకుల లారీకి కూలీగా వెళుతున్నాడు. పుత్తనవారిపల్లె చెక్‌పోస్టు వద్ద ఆగి చలాన కట్టి తిరిగి వెళుతుండగా క్యాబిన్‌లో ఉన్న గౌరి టాప్‌పైకి ఎక్కుతూ జారి కిందపడ్డారు. లారీ వెనుక టైర్లు కాళ్ల మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మా దారి బెల్టు దారి..

● రైల్వేకోడూరులో మద్యం సిండికేట్‌కు ముమ్మర యత్నాలు..!

● గ్రామాలకు రూ.లక్షల విలువ చేసే మద్యం తరలింపు

● అదే వరుసలో నాటు-ఘాటు..?



దుకాణం వెనుకవైపు మద్యం తాగి వస్తున్న మందుబాబులు

రైల్వేకోడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులో మొత్తం 11 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణ యజమానులు సిండికేటు కావాలని గత నెల నుంచి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కానీ కొందరు ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు నాటు ఘాటెక్కుతోంది. అధికారులు మద్యం దుకాణాలపై చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో మద్యం వ్యాపారుల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయి. ఒక్కొక్క దుకాణం నుంచి రోజుకు రూ.లక్షకు పైగా విలువ చేసే మద్యం బెల్టుషాపులకు వెళుతోంది. దీంతో గ్రామాల్లో మద్యం వ్యాపారాలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాటుసారాపై



మద్యందుకాణం సమీపంలోనే తినుబండారాల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు

సంబంధిత శాఖ నిఘా లేకపోవడంతో మద్యం సీసాల్లో నాటుసారాకు రంగు వేసి విక్రయాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మందుబాబులకు కొరత లేకుండా పోయింది. కానీ నాటుసారా మద్యం సీసాల్లో ఎక్కడ కలుపుతున్నారన్నది అంతు పట్టని రహస్యంగా మారింది. బెల్టుషాపులకు కూడా ఈ రకం మద్యం వెళుతుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ కూడా బెల్టుషాపులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మద్యం యజమానులకు అనుకూలంగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో మద్యం ఏరులైపారుతుండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఎక్కువగా రైల్వేస్టేషన్, జంగిటివారిపల్లె, మైసూరివారిపల్లె, సూరపురాజుపల్లె, ధర్మాపురం, పగడాలపల్లె, రెడ్డివారిపల్లెకు వెళ్లే దారుల్లో మందుబాబులు నిత్యం కనిపిస్తున్నారు.

నాటు లేదు.. బెల్టుపై చర్యలు..

నాటుసారా ఎక్కడ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. బెల్టుపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం. నిఘా పెంచాం. నాటుసారాను మద్యం సీసాల్లో కలుపుతున్నారని సమాచారమిస్తే మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం.

- తులసి, ఎక్సైజ్ సీఐ

దీంతో ఆయా దారుల్లో మహిళలు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇదే కాకుండా ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ మద్యందుకాణంలో ఒక బీరుపై రూ.10 అదనంగా తీసుకుంటున్నారని మద్యంప్రియులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్టుకు వెళ్లే మద్యం స్టాకును పరిశీలించాలని, నాటుసారాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్షనర్ల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

● పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నరెడ్డెన్న



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చిన్నరెడ్డెన్న

రాయచోటిటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నరెడ్డెన్న, జిల్లా కార్యదర్శి వాకా రెడ్డికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్స్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, పెన్షనర్లకు తగ్గించిన అడిషినల్ క్వాంటం పెన్షన్‌ను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈహెచ్‌ఎస్ వైద్య సౌకర్య పరిమితిని ఐదు లక్షలకు పెంచాలని కోరారు. అలాగే మండల స్థాయి, తాలూకా స్థాయి ప్రభుత్వ పెన్షనర్ల సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా జిల్లా సంఘాలను, రాష్ట్ర సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పెన్షన్ల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్రమణ, జిల్లా కోశాధికారి జయచంద్రారెడ్డి, గుడిబండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'హలో మాల.. చలో తిరుపతి'ని జయప్రదం చేయండి

● మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు అన్నమయ్య జిల్లా నేతలు

రాయచోటిటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 23వ తేదీన తిరుపతి నగరంలో జరగనున్న సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డైట్ కేంద్రంలో మాలమహానాడు జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హలో మాల.. చలో తిరుపతి సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాయలసీమ మాలల సింహగర్జన జేసీ అధ్యక్షుడు దళితరత్న డాక్టర్ యామల సుదర్శనం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపడితే మాలలు ఎంతో నష్టపోతారని, అదేవిధంగా ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ పెడితే ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు చేస్తున్న వారికి కూడా ఎంతో నష్టం కలుగుతుందన్నారు. కావున మాల మేధావులు, అంబేద్కర్ వాదులు, మాల సంఘాల నాయకులు, మాల అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాలు, యువజన నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలల సింహగర్జన జేఏసీ ఉపాధ్యక్షుడు ధనశేఖర్, జేఏసీ ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, మీడియా ప్రతినిధి శేఖర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాకిబండ నాగరాజ, జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల జాన్‌సుధాకర్, రాయచోటి డివిజన్ అధ్యక్షులు వినోద్‌రాజు, జిల్లా సహాయ కార్యదర్శిగా దుద్యాల రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

● లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్

రామాపురం, మార్చి9(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం రామాపురం మండల కేంద్రంలోని వెంకటేశ్వర హైస్కూల్‌లో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే ప్రేమాలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని అధ్యక్షుడు శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న డిస్ట్రిక్ట్ గవర్నర్ పీయంజేఎఫ్ లయన్ గౌతమ్ హాజరై మాట్లాడుతూ ఉచిత కంటి వైద్యశిబిరం, వృద్ధులకు దుస్తుల పంపిణీ చేయడం మంచి పరిణామమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించడం అదృష్టమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే సేవ చేయడానికి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాతలు లయన్ ఆంజనేయరెడ్డి, లయన్ మిక్కిలినేని ప్రసాద్‌నాయుడు, రిటైర్డ్ ఎస్‌బీఐ ఆఫీసర్ సుబ్రమణ్యంశెట్టి, లయన్స్ సభ్యులు రామాపురం మండల అంజనారెడ్డి, గడికోట భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరహైస్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద కంటి ఆసుపత్రి సిబ్బంది, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు భేష్



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న గౌతమ్

రాయచోటిటౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లిలో ది రాచవీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు అందరికీ ఆదర్శనీయమని లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాయచోటి పర్యటన సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రిని సందర్శించారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఈ ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదల సౌకర్యం కంటి ఆసుపత్రి ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో కంటి ఆసుపత్రి ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా ది రాచవీడు లయన్స్ క్లబ్ ద్వారా సేవలను మరింత విస్తృతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మెన్ వైవీఆర్ స్వరూపగుప్తా, లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్‌లు శివారెడ్డి, మహమ్మద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

పారిశ్రామిక వేత్తలుగా మహిళలను తీర్చిదిద్దుతాం

● టీడీపీ జిల్లా ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధిపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని టీడీపీ జిల్లా ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల ప్రగతి కోసం ప్రతి జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారని ఆయన తెలిపారు. మహిళల చేత డ్వాక్రా ఉత్పత్తులను రికార్డు స్థాయిలో విక్రయించారన్నారు. విశ్వకర్మ ద్వారా లక్ష రూపాయల రుణం అందించి మహిళలకు ఆర్థిక మద్దతు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, గన్నే సుబ్బనరసయ్యనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ మండలాధ్యక్షుడు కోవూరు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

● రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ

సిద్దవటం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరిగే ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మాధవరం గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈవేడుకలకు జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, పదే పదే పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.

'కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలి'



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాజంపేట టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈనెల 19న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వారు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్మికుల వేతనాలు నెలకు రూ.10వేలు చేయాలని, ఎటువంటి కారణాలు లేకుండా అర్ధాంతరంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. అలాగే హెల్త్‌కార్డు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్, యూనియన్ నాయకులు ఆదినారాయణ, ఆడిటర్ ముజఫర్, సాంబా, బాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ



హాస్టల్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాయచోటిటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుకుంటున్న పేద విద్యార్థినులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. గంగయ్య యాదవ్ ఆర్థిక సహకారంతో 50 మంది విద్యార్థినులకు అట్ట, పెన్ను, పెన్సిల్, స్కేలు తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మయాదవ్ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థినులు చక్కగా చదువుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రమణయాదవ్ మాట్లాడుతూ భవిష్యత్తుకు చదువే పునాది అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ జీవీ రమణ, ఉపాధ్యాయులు సంకా రామయ్య, మల్లికార్జున, జయరాం, నాగేశ్వర, సంఘం సభ్యులు శరత్‌కుమార్, వైవీ శివయ్య, వార్డెన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లీ.. చల్లంగా చూడమ్మా..

● అట్టహాసంగా అక్కదేవతల తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో లింగేశ్వరుడు

సంబేపల్లె, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లి సమీపంలో ఉన్న అక్కదేవత తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రతి ఏడాది మహాశివరాత్రి అనంతరం జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం ఇక్కడ వెలసిన మహాలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు, హోమాలు చేశారు. రాత్రి 8 గంటలకు నల్లగంగమ్మ తల్లి ఆర్కెస్ట్రా ఈవెంట్స్ రాజమండ్రి కాళికా అమ్మవారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం భక్తులు కట్టిన చాందినీ బండ్ల ఊరేగింపు అనంతరం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

దూళ్లవారిపల్లె జాతరలో సుగవాసి

రాయచోటిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామం దూళ్లవారిపల్లెలో వెలసిన గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగుండ్ల రెడ్డెయ్య కుటుంబం ఆహ్వానం మేరకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు ఉత్సవాలకు హాజరై గంగమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలు హిందూ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా, శాంతియుతంగా జాతరలు జరుపుకోవాలని కోరారు.



గంగమ్మ తల్లి పల్లకీని మోస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు



నల్లగంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

నల్లగంగమ్మ తల్లి సన్నిధిలో మంత్రి సోదరుడు

సంబేపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేవరాయి నల్లగంగమ్మ తల్లీ.. చల్లంగా చూడమ్మా అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని అభిమాని జానం నందాయాదవ్ అమ్మవారికి మొక్కుబడి చెల్లించిన సందర్భంగా ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యారు. నల్లగంగమ్మ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి విందు భోజనం చేశారు.

జీఎస్ఓసీ ఇంటర్న్‌షిప్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్న అజాద్ గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ (జీఎస్ఓసీ) ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సమర్పించిన వేలాది ప్రాజెక్టులలో అజాద్ ప్రాజెక్టు ప్రత్యేకంగా నిలిచిందన్నారు. టాప్ 1000 ప్రాజెక్టులలో ఒకరిగా నిలిపిందన్నారు. అజాద్ తన సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడమే కాకుండా రూ.2,50,000 స్టైఫండ్ అందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్, సీఎస్ఈ హెచ్‌ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాష్‌లు అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

పులివెందుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం నిర్వహించిననృత్య ప్రదర్శనలు అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణ వేంపల్లెకు చెందిన సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్ చిన్నారులు శబరీష్ డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. శాస్త్రీయ, జానపద, సినిమా పాటలకు నృత్యాలతో పాటు తైక్వాండో ప్రదర్శన నిర్వహించారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు కసరత్తు

- అభ్యంతరాల సవరణకు ప్రత్యేక కమిటీలు
- నేటితో ముగియనున్న పరిశీలనలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో నమోదు చేసుకున్న వివరాల ఆధారంగా తాత్కాలిక సీనియారిటీ జాబితాలను ప్రకటించింది. ఇందులో అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీ లోగా ఫిర్యాదు చేసి సవరించుకోవాలని విద్యాశాఖ తెలిపింది. ఇందులో భాగంగానే గత మూడో తేదీ నుంచి ప్రతిరోజు సాయంత్రం మూడు నుంచి ఏడు గంటల వరకు ప్రత్యేక కమిటీలు పనిచేస్తూ ఉన్నాయి. వివరాలు పరిశీలిస్తే... జిల్లా స్థాయి కమిటీలో పాత జిల్లా కేంద్రం విద్యాశాఖ అధికారి ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ పాత జిల్లా కేంద్ర ఏడీ మెంబర్ కన్వీనర్ గాను, కొత్త జిల్లా కేంద్రం ఏడీ, పాత కొత్త జిల్లాల సూపరింటెండెంట్లు సభ్యులుగా ఉంటూ కేడర్ వారీగా పరిశీలన కోసం ఉప విద్యాశాఖ అధికారి, డీసీఈబీ సెక్రటరీ, సీనియర్ హెడ్మాస్టర్ ప్రత్యేక కమిటీలుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను జిల్లా స్థాయి కమిటీలు అప్పటి కప్పుడే పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి కమిటీ నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పీల్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. జిల్లా ఫిర్యాదుల పరిష్కార కమిటీ ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈనెల 10వ తేదీ వరకు పని చేస్తుంది. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారుచేస్తారు. సాధారణ సీనియారిటీ జాబితా డీఎస్సీలోని మెరిట్ ర్యాంకు ఆధారంగా, సబార్డినేట్ సర్వీస్ రూల్ 33 ప్రకారం తయారు చేస్తారు. పదోన్నతుల సీనియారిటీ జాబితా రోస్టర్ కం మెరిట్, అడక్వసీ ఆఫ్ ప్రమోషన్ రిజర్వేషన్స్ నిబంధనల మేరకు సబార్డినేట్ సర్వీస్ రూల్ 20ని ఆధారంచేసుకొని తుది రూపు తీసుకువస్తారు.

సాధారణ తాత్కాలిక, సీనియారిటీ జాబితాలో తికమకలు

రాష్ట్ర ఆదేశాలను అనుసరిస్తూ జిల్లా విద్యాశాఖ సాధారణ తాత్కాలిక సీనియారిటీ జాబితాలను విడుదల చేసింది. వీటిని జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలను తెలపాలంటూ ప్రకటనలు కూడా విడుదల చేసింది. సీనియారిటీ జాబితాను పరిశీలించిన మీదట టీఐ ఎస్‌లో కులాల కేటగిరీలు ఖచ్చితంగా నమోదు చేసిన కొంత మంది ఉపాధ్యాయుల పేర్లు తాత్కాలిక సీనియారిటీ జాబితాలో వేరుగా నమోదైనట్లు తెలుస్తోంది. డీఎస్సీల వారీగా ర్యాంకుల జాబితాలు అన్ని బ్యాచులకు అందుబాటులో లేకపోవడం వల్ల సీనియారిటీ నిర్ణయించడంలో కొన్ని ఇబ్బందులు చోటుచేసు కున్నాయి. కొన్ని డీఎస్సీల వారీ నియామక పత్రాలతో ర్యాంకును నమోదు చేయక పోవడంతో కూడా సమస్య ఉత్పన్నమవుతోంది. అదే మాదిరిగా ప్రతి డీఎస్సీకీ సంబంధించిన ఖచ్చితమైన రికార్డులు విద్యా శాఖ వద్ద లేకపోవడం చర్చనీ యాంశమైంది. గతంలో డీఎస్సీల రికార్డులన్నీ జిల్లా పరిషత్ ఆధీ నంలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా భావించాల్సి వస్తోంది. డీఈఓ ఆధీనంలో నిర్వహించిన డీఎస్సీల ఉపాధ్యాయులకు నియామక పత్రాలలో ర్యాంకులను నమోదు చేసినా అది రోస్టర్ ర్యాంకా? మెరిట్ ర్యాంకా? అన్న దానిపై స్పష్టత లేదు. దీనితో సీనియారిటీ జాబితాలో ర్యాంకుల నమోదుపై పలు అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. 1996 మూడవ బ్యాచ్‌కు అసలు ర్యాంకులే లేనందున ఉన్నత ర్యాంకు ఉన్నవారికి అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదు. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారు చేస్తారు. జిల్లా విద్యా అధికారి ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల పదోన్నతులకు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెడ్‌మాస్టర్ పోస్టులకు పదోన్నతులకు అధికారిగా ఉంటారు.

> **ర్యాంకుల జాబితా ప్రకటించాలి**
>
> 
>
> ఇప్పటి వరకు జరిగిన అన్న డీఎస్సీల బ్యాచ్‌లు, ఉపాధ్యాయుల వారీగా మెరిట్ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. సీనియారిటీ జాబితాలో ఉపాధ్యాయులకు చెందిన ర్యాంకుల వివరాలు ఇచ్చినా, స్పష్టత కోసం డీఎస్సీ వారీ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. రోస్టర్ ర్యాంకు, మెరిట్ ర్యాంకు వివరాలపై స్పష్టతను ఇవ్వాలి. ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించిన డీఎస్సీ మెరిట్ ర్యాంకుతో పాటు మార్కుల వివరాలు తెలపాలి. గతంలో మాదిరి పదోన్నతులు ఇచ్చే ఖాళీల సంఖ్యకు మూడు రెట్లు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సంసిద్ధం చేసే మాదిరిగా ముందుకు సాగాలి. ఫైనల్ సీనియారిటీ జాబితాలు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రకటించాలి.
>
> - సి.వి ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు



డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు

పదోన్నతులపై అనుమానాలు

పదోన్నతులపై ఉపాధ్యాయులకు పలు అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల మిగులు ఏర్పడుతున్న సందర్భంలో పదోన్నతులకు ఖాళీలు ఎక్కువున్నాయని చర్చలు సాగుతున్నాయి. మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే నిబంధనలు వెలువడిన తర్వాత మాత్రమే పదోన్నతులపై స్పష్టమైన వివరాలు అందే అవకాశం ఉంది. దీనిపై మెగా డీఎస్సీ కూడా ఆధారపడి ఉంటుందని తెలుస్తుంది. స్పష్టమైన సర్దుబాటు నిబంధనలు విడుదల చేయాలని కూడా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కామేశ్వరుడిని తాకిన భానుడి కిరణాలు



స్వామి పీఠంపై సూర్యకిరణాలు

వాల్మీకిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో ఉన్న లక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేక సమయంలో సూర్య కిరణాలు స్వామివారి పీఠాన్ని తాకాయి. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు పూజలు చేసి తన్మయం చెందారు. అర్చకుడు గోన వరప్రసాద్ శీనాస్వామి కామేశ్వరస్వామికి పూజలు చేశారు.

12న మల్లయ్యకొండ ఆలయ హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన హుండీలోని కానుకలను ఈ నెల 12న లెక్కించనున్నట్లు ఈవో మునిరాజ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు (ఫిబ్రవరి 27)న తాత్కాలిక హుండీ , సేవా టికెట్లు, కల్యాణోత్సవం చదివింపులు, చందాల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5,08,918లు ఆదాయం వచ్చింది. అదే రోజున నిర్వహించాల్సి ప్రధాన హుండీ లెక్కింపు అనివార్య కారణాలతో వాయిదా పడిందని ఈవో తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

- రూ. 3.24లక్షలు స్వాధీనం
- కానిస్టేబుల్‌పై కేసు నమోదు
- మరికొందరు అధికారులపై అంతర్గత విచారణ

రాయచోటిటౌన్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి:) జూదగృహంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.3.24 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు ఈ జూదగృహం నిర్వహణలో రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారులోని సుండుపల్లె మార్గంలో ఉన్న టిడ్కో ఇళ్లలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో.. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేసి, మోహన్ అనే వ్యక్తితోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాలకు చెందిన 10 మందిని అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. సదరు కానిస్టేబుల్‌పైనా కేసు నమోదు చేసినట్లు సమాచారం. జూదం ద్వారా సంపాదించే మొత్తంలో కొందరు పైస్థాయి అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. మామూళ్లు తీసుకుని.. జూదం నిర్వహించుకోవడానికి సహకరిస్తున్న ఆయా అధికారులపైనా ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ... 11 మంది జూదరులను అరెస్టు చేశామన్నారు. కానిస్టేబుల్‌పైన ఇంకా కేసు నమోదు చేయలేదని, విచారణ జరుగుతోందన్నారు. జూదం నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తనకు మామూళ్లు ఇచ్చారనడం వాస్తవం కాదన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. కూలీలకు గాయాలు



సంఘటనా స్థలంలో లారీ, ఆటో

పులివెందుల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో 12 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం పట్టణ సమీపంలోని చిన్న రంగాపురం గ్రామం వద్ద గల ఫుడ్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద అరటికాయల లోడుకు వెళుతున్న ఢిల్లీ లారీ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలోని 12 మంది కూలీలు గాయపడ్డారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ నుంచి కూలి పని నిమిత్తం 12 మంది ఇప్పట్ల గ్రామానికి వెళుతుండగా చిన్నరంగాపురం వద్ద వెనక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొంది. దీంతె ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కంపచెట్లలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ ఎన్వీ రమణ, ట్రాఫిక్ సీఐ హాజీవలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణంలో చోరీ..



సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుడి చిత్రం

వాల్మీకిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం తాళాలను పగులగొట్టి లోనికి చొరబడారు. రూ.33 వేలు, పలు మద్యం బాటిళ్ల అపహరించుకు పోయారు. ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని శ్రీనివాసులు చోరీ విషయాన్ని గమనించి ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా పుటేజీ సమర్పించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై దాడి .. ఐదుగురిపై కేసు

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై దాడి చేయడంతోపాటు ఫోన్‌లో దూషించారంటూ మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన భూమిరెడ్డి విజయభారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవీ రమణ, భానుకిరణ్, శివతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. రెండు రోజుల క్రితం సాయినగర్‌లో భూమిరెడ్డి విజయభారతి ఉన్న ఇంటి వద్దకు వెళ్లి తలుపులను గట్టిగా తట్టారని, ఆమె భర్త శ్రీనాథ్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తనను శ్రీనాథ్ రెడ్డి ఫోన్‌లో బెదిరించడంతోపాటు, అసభ్య సందేశం పెట్టాడంటూ శివ కూడా ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కలసపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిసిద్దుపల్లెలో కోనేటి సునీల్ (24) అనే యువకుడు ఆదివారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య కుమారుడు సునీల్ ఇటీవలే వరికోతయంత్రం కొనుగోలు చేశాడు. అయితే, దాని విషయం పట్టించుకోకుండా ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కాలం గడుపుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కలసపాడు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

నేడే చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సినీ నటి కీర్తి సురేష్ రాక



కడప (మారుతీనగర్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్‌గేట్ ఎదురుగా సోమవారం చెన్నయ్ షాపింగ్ మాల్ 29వ బ్రాంచ్ ప్రారంభం కానుంది. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో విస్తరించిన చెన్నయ్ షాపింగ్‌మాల్ కడప నగరవాసులకు నేటి నుంచి పరిచయం కానుంది. నాణ్యమైన దుస్తులు, లేడీస్ ఫ్యాన్సీ ఐటమ్స్ అందించేందుకు షాపింగ్‌మాల్ సిద్ధమైంది. ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రజలు చెన్నయ్ షాపింగ్ మాల్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో తిరుపతికి వెళ్లి కొనుగోలు చేసేవారు. నేడు కడప నగరానికి చెన్నయ్ షాపింగ్ మాల్ రావడంతో ప్రజలు మాల్ ప్రారంభం కోసం ఆసక్తిగా చూస్తున్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. మాల్‌లో రూ.99కే మహిళలకు చీరలు దొరుకుతాయని ప్రచారం చేయడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మొదటిరోజు షాపును సందర్శించే అవకాశం ఉంది.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

సీకేదిన్నె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర మొదటి ఆదివారం సందర్భంగా భక్తులు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లో మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

రామసముద్రం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మట్లవారిపల్లెలో ఆదివారం ఉజ్జనేశ్వర, శిగరేశ్వర, బీరేశ్వర, బత్తేశ్వర శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడుకు చెందిన కురబ కుల భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పొలిమేరల్లో టెంట్లు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ప్రతి 14 ఏళ్లకు ఒకసారి కురబ సంఘాల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వందల సంఖ్యలో కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు రావడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రామసముద్రం-మదనపల్లె వెళ్లే బస్సులను ఆర్.నడింపల్లె, చెంబకూరు మీదుగా మళ్లించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూజలు చేయించారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

- ఆరు పదుల వయసులో ఆత్మీయ సమావేశం
- కోవరంగుట్టపల్లిలో పూర్వ విద్యార్థుల కలయిక



కోవరంగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1974-75లో పదవ తరగతి చదివిన విద్యార్థులు

సింహాద్రిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వారంతా ఆరు పదుల వయసు దాటిన వారు. యాభై ఏళ్లప్పుడు పదో తరగతి చదివారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ కలసి తాము చదువుకున్న కోవరంగుట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కలిశారు. 1974-75 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 37 మంది ఆ విద్యార్థులు అప్పటి సంఘటనలు నెమరువేసుకున్నారు, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ రోజు ఎన్నటికీ మరువలేమని చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసు కుంటామని కలలో కూడా ఊహించలేదని పలువురు మాట్లాడారు. గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం రామలింగారెడ్డిని తుమ్మల పల్లి సూరుడు సన్మానించారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మధుసూదనశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పాఠశాల స్థలదాత వారసుడు మండల మాజీ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్‌రెడ్డి, మానవతా సేవా సమితి అధ్యక్షుడు కొండారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేశారు.

ప్రాణాలు బలిగొన్న రహదారులు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

అన్నమయ్య జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయాలపాలయ్యారు.



ఓబులవారిపల్లె : సంఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

ఓబులవారిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట పంచాయతీ పెరియవరం గ్రామానికి చెందిన అందె వెంకటేశ్(26) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న తన మేనల్లుడు విజయ్‌ను చూడడానికి ఆదివారం బైక్‌పై కొర్లకుంటకు వచ్చాడు. స్కూల్లో అనుమతి తీసుకుని తన అల్లుడితోపాటు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బొమ్మవరం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న అతని అల్లుడు విజయ్ గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అందుబాటులో లేకపోవడం తిరుపతికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి బంధువులకు సమాచారాన్ని అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడు విజయ్

విద్యార్థి దుర్మరణం...

మదనపల్లె అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, శివాజీనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు ఉదయ్‌కిరణ్(20) శనివారం రాత్రి పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మిత్రులతో కలసి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం బైక్‌పై తిరిగి వస్తూ కనుమలో గంగమ్మ ఆలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న బంకును ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

యువతను నమ్మించి మోసగించడం భావ్యమా?

వేంపల్లె,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యమా అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీ నిరుద్యోగ భృతి అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు చొప్పున తమ ప్రభుత్వం ఇస్తుందని సూపర్‌సిక్స్ హామీలలో పేర్కొన్నారన్నారు. దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులకు ఏడాదికి దాదాపు రూ.7200 కోట్లు విడుదల చేయాలన్నారు. కానీ 2024-25 బడ్జెట్‌లో, 2025-26 బడ్జెట్‌లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి అయిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

జ్యోతి దేవాలయంలో పురాతన శాసనం



జ్యోతి సిద్దేశ్వర ఆలయ ప్రాంగణంలో గుర్తించిన శాసనం

సిద్దవటం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతి గ్రామంలో ఉన్న జ్యో తిలింగేశ్వర, సిద్దేశ్వ స్వామి దే వాలయానికి దక్షిణంగా ఉన్న మండపం అడుగు భాగాన మ రో శాసనం వెలుగులోకి వచ్చిం ది. ఫిబ్రవరి 26న మహా శివ రాత్రి సందర్భంగా దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్య క్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి మురికినాటి శ్రీనివాసులు ఇక్కడున్న శివలింగాలను, మండపాన్ని సందర్శించారు. ఈ క్రమంలో మండపం ఫ్లో రింగుపై శాస నాన్ని కనుగొన్నారు. దీనిని ఫొటో తీసి బెంగుళూరు మైసూరు లో ఉన్న భారత పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.మునిరత్నంరెడ్డికి పంపగా ఆయన పరిశీలించారని వారు తెలియజేశారు. ఇలాంటి ప్రాచీన చరిత్ర కలిగిన శాసనాలకు రక్షణ కల్పించాలని కోరారు.

కడప ఉక్కు సాధన ఉద్యమానికి సన్నద్ధం కావాలి

కడప సెవెన్ రోడ్స్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు మరోమారు ఉద్యమానికి సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రూ.3.22లక్షలకోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50,65,345 బడ్జెట్‌లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావనే చేయక పోవడం సర్కారు దగాకోరుతనాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.5,13,572 ఆదాయం



ట్రస్టు జమా, ఖర్చుల వివరాలను వెల్లడిస్తున్న ట్రస్టు సభ్యులు

తంబళ్లపల్లె, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్(అన్నదాన ట్రస్టు)కు ఈ ఏడాది రూ.5,13,572లు ఆదాయం వచ్చినట్లు ట్రస్టు చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. ఏటా మల్లయ్యకొండ బ్రహ్మోత్సవాల సమయంలో మహాశివరాత్రి పర్వదినం రోజు కొండ కింద మద్దాభక్తుని బావి వద్ద వేల మంది భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహిస్తారు. పలువురు భక్తులు నగదు, వస్తు రూపంలో ట్రస్టుకు విరాళాలు అందజేస్తుంటారు. ఆదివారం ట్రస్టు సభ్యులు కొండ కింద అన్నదాన సత్రంలో సమావేశం నిర్వహించి భక్తులు అందచేసిన విరాళాలు, ఖర్చుల వివరాలను వెల్లడించారు. భక్తులు చందాలు, కానుకల రూపంలో ఇచ్చిన విరాళాల ద్వారా మొత్తం రూ.18,18,694లు ఆదాయం రాగా, అన్నదానానికి రూ.13,05,122లు ఖర్చు చేశారు. పోను మిగిలిన రూ.5,13,572లు ఆదాయంగా చూపినట్లు చైర్మెన్ తెలిపారు.

ఆ... వేదన షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణ



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సమస్యలను ఆధారంగా ఆ... వేదన షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్నట్లు షార్ట్‌ఫిల్మ్ నిర్మాతలు తెలిపారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ హైస్కూల్‌లో ఆదివారం ఆ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. షార్ట్‌ఫిల్మ్ నిర్మాతలు సీనియర్ సిటిజన్స్ ఏపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మునిగోటి గోపాలకృష్ణ, ధనలక్ష్మీ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలు ఇతివృత్తంగా వారికి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆ ఫిల్మ్ తీస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా కనువిప్పు సీరియల్‌కు మంచి ఆదరణ లభించిందన్నారు. కార్యక్రమానికి ముందు శ్రీకృష్ణదేవరాయల జాతీయ అవార్డు అందుకున్న మునిగోపాలకృష్ణ దంపతులను సీనియర్ సిటిజన్స్ ఘనంగా సన్మానించారు. చిత్ర దర్శకుడు రాజేంద్ర, సీనియర్ సిటిజన్స్ నేతలు గొల్లపూడి తిరుపతిరావు, టీఎస్‌పే కృష్ణమూర్తి, ఉస్మాన్‌సాహెబ్, నాగభూషణరావు, శ్రీనివాసులు, నాగరాజ, శకుంతలమ్మ, మనోరమ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చిట్టిఅన్నవరంలో వెలసిన సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. ఆదివారం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అధ్యక్షుడు ఎ.అమరనాథ్ మాట్లాడుతూ సోమవారం ఉదయం గణపతి పూజ, సహస్ర లింగార్చన నిర్వహిస్తామని, 11న మంగళవారం సహస్ర లింగార్చన ఉంటుందన్నారు. సాయంత్రం విద్యాశంకర భారతి స్వామి ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. 12న సత్యదేవ సదన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, నవగ్రహ, రుద్ర, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ జరుగుతోందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

12న కలికిరి సంతకు వేలం పాటలు

కలికిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కలికిరి వారపు సంతకు ఈ నెల 12వ తేదీ బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మేజర్ పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకూ కంట్రాక్టర్లు రుసుము వసూలు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు వాహనాల రుసుములు వసూళ్ళు, జంతు వధశాల, మాంసం దుకాణాలు, పంచాయతీ కార్యాలయం ఆవరణలోని మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణకు వేలం నిర్వహించనున్నట్లు అశోక్ వివరించారు. పంచాయతీ నిర్ణయించిన మేరకు వీటికి విడివిడిగా డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. నగదు రూపంలో కాకుండా కేవలం పంచాయతీ కార్యదర్శి పేరిట బ్యాంకు డీడీలు సమర్పించాలని తెలిపారు. వివరాల కోసం కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు.

'సింహగర్జన'ను విజయవంతం చేయండి

నిమ్మనపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు ఆధ్వర్యంలో చేపడుతున్న సింహగర్జనను విజయవతం చేయాలని జిల్లా అధ్యక్షుడు శివకుమార్, మండల అధ్యక్షుడు వీరణాల మాణిక్యం పిలుపునిచ్చారు. ఆదివారం తరిగొండవారిపల్లి, బండమీద మాలపల్లి, కొత్తపల్లి, నల్లగొండ హరిజనవాడల్లో సింహగర్జన పోస్టర్లను పంపిణీ చేశారు. 23న జరగబోయే మాలల సిహగర్జనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జయన్న, యర్రయ్య శ్రీరాములు, సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.



వాల్మీకి పురం పోలీసు స్టేషన్ మేడిపండు



గొడలకు నెమ్ము చేరిన దృశ్యం

వాల్మీకిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చూసేందుకు అందంగా కన్పించినా లోపల అందవిహీనమవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల రక్షణ కోసం పాటుపడే రక్షకులకు కనీస భద్రత కరవైంది. స్థానిక పోలీసు స్టేషన్ చూసేందుకు బాగుందనిపించినా లోపల పెచ్చులూడుతూ పైకప్పు, చిరు వర్షానికే ఉరుస్తున్న భవనాలు వారి భద్రతను ప్రశ్నిస్తున్నాయి. 1999లో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వివరాల్లోకెళితే...

ప్రజల రక్షణ కోసం నిత్యం సేవలందించే పోలీసులకే రక్షణ కరవైందని, వారి ఇబ్బందులు వర్ణనాతీతమనే చెప్పాలి. వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ భవనాలు చూడడానికి సుందరంగా కనిపిస్తున్నా లోపల అంతా డొల్లలా తయారైందనే చెప్పవచ్చు. స్థానికంగా 1999లో నిర్మించినా నిర్మాణాల లోపమో ఏమో తెలియదు కానీ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది నిత్యం జాగ్రత్తగా నడుచు కోవాల్సిందే. స్టేషన్ భవనాల లోపలి భాగంలో పైకప్పు పెచ్చులూడిపడు తున్నాయి. చిన్నపాటి వర్షానికే స్టేషన్ భవ నాలు పూర్తిగా ఉరుస్తూ జలపాతాలను తలపిస్తున్నాయి. సిబ్బంది అగచాట్లు వర్ణనాతీతం. రికార్డులకు, కంప్యూటర్ విభాగాల్లో వర్షాకాలంలో పూర్తిగా రక్షణ లేకుండా పోతోంది. ఉరుస్తున్న భవనాల్లో విధులు నిర్వహించడం రికార్డులకు గుడ్డలు కప్పి కాపాడుకోవడంతో సరిపెట్టు కుంటున్నారు. పోలీస్‌స్టేషన్ భవనాలు పూర్తిగా పైకప్పు పెచ్చులూడి పడుతూ ఏ నిమిషం ప్రమాదం వచ్చి పడుతోందన్న భయాందోళనలు సిబ్బందిలో నెలకొన్నాయి. మరుగు దొడ్ల గది వైపు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక గది నుంచి మరో గదికి వెళ్లాలన్నా సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీస్ స్టేషన్ భవనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



పెచ్చులూడుతున్న పోలీస్ స్టేషన్ పైకప్పు

పాడి పరిశ్రమకు వెన్నుదన్నుగా గ్రామీణ మహిళలు

హెరిటేజ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పీలేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ పెద్ద ఎత్తున విస్తరిల్లడానికి గ్రామీణ మహిళలే ప్రధాన కారణమని పలువురు ప్రముఖులు కొనియాడారు. పీలేరు హెరిటేజ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దినదిన ప్రవర్ధమానమవుతున్న అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మహిళా రైతులకు ప్రమాద బీమా కింద రూ.2.10 లక్షలు, ఫీడ్, కాల్షియం మినరల్ మిక్చర్‌పై 10 నుంచి 20 శాతం సబ్సిడీ కల్పించామన్నారు. రైతులకు రూ. 50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. 70 మంది మహిళా పాడి రైతులకు శాలువాలు కప్పి సన్మానించారు. మహిళా రైతులు తమ అనుభవాలు, విజయగాథలను వివరించారు. హెరిటేజ్ పీలేరు యూనిట్ మేనేజరు పి.శివశంకరయ్య, సంస్థ టిక్నో ప్రాజెక్ట్ మేనేజర్లు రామకృష్ణ, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్‌ఫ్యాక్టరీ కార్మికులకు అండగా వుంటా



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పుంగనూరురోడ్డులో మూతపడిన జ్యూస్ ఫ్యాక్టరీ కార్మికులకు అండగా వుంటానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం జ్యూస్ ఫ్యాక్టరీ కార్మికులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏళ్లుగా పరిష్కారం కాని కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. 253 మంది కార్మికుల కోసం నిర్మించుకుంటున్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిన్న మహేష్, కత్తి లక్ష్మన్న, వెంకటరమణ, పూలకుంట్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బొగిటివారిపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

తొమ్మిదిమందికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మదనపనల్లె మండలం బొగిటివారిపల్లెలో గంగమ్మ గుడి విషయమై ఆదివారం ఇరువర్గాలు ఘర్షణ పడి కొట్టుకోవడంతో తొమ్మిదిమంది గాయపడ్డారని తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో కొద్ది రోజులుగా గంగమ్మ గుడి నిర్మాణాలు చేపట్టాలని గ్రామంలో ఉన్న వాల్మీకులు నిర్ణయించుకున్నారు. అదేగ్రామానికి చెందిన మరికొందరు గతంలో గొడవలు పడ్డారు. పోలీసులు వారికి సర్ది చెప్పడంతో వారు గుడి కట్టుకోవడానికి అంగీకరించారు. దీంతో ఆదివారం గంగమ్మ దేవాలయం నిర్మాణానికి పునాదులు వేస్తుంటే అదే గ్రామానికి చెందిన మరొక వర్గం అడ్డుకోవడంతో ఘర్షణపడి ఇరువర్గాలు రాళ్లతో పరస్పరం దాడిచేసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటస్వామి, కృష్ణవేణి, రజిత, రత్నమ్మ, నారాయణ స్వామి, మరొక వర్గంలో చలపతి భార్య రాజమ్మ, శ్రీనివాసులు భార్య నరసమ్మ, చలపతి కుమారుడు లక్ష్మీనారాయణ, దేవమ్మ గాయపడ్డారు. తాలుకా సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ జడ్పీటీసీ సుభాష్‌రెడ్డి మృతి



కురబలకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ ఎల్.సుభాష్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించిన నేపథ్యంలో పార్టీలో చేరి క్రియాశీలకంగా పని చేశారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో మండల పరిషత్ వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో తొలి మండల పరిషత్ ఎంపీపీగా పని చేశారు. అనంతరం 1987 నుంచి 1997 వరకు రెండు పర్యాయాలు జడ్పీటీసీగా పని చేశారు. ఇతనికి మండల పరిధిలో ప్రజలకు నిస్వార్థంగా సేవలందించి మన్ననలు అందుకున్నారు. 1997 అనంతరం జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందడంతో ఆ రాజకీయాల్లో ఇమడలేక రాజకీ యాలకు దూరంగా ఉన్నారు. కాగా ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. కాగా ఆయనకు జంగావారిపల్లె సమీపంలోని రేగడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

బూత్ లెవల్ సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు పంచాయతీలోని జగన్‌కాలనీలో 5,6 బూత్‌ల సమస్యలను బీజేపీ మండల రూరల్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి వినతులను ప్రజల వద్దనుంచి స్వీకరించారు. బూత్ లెవల్ సమస్యలను కాలనీలో సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నేతలు ధర్మారెడ్డి, దేవా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా కృష్ణమూర్తి



వాల్మీకి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నిక పత్రం అందుకుంటున్న కృష్ణమూర్తి

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహాసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా బొగ్గిటి కృష్ణమూర్తిని వాల్మీకి మహాసేన ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చాలని కోరగా కొన్నేళ్లుగా అసెంబ్లీ, పార్లమెంట్లల్లో బిల్లులు పెట్టినా ఇంతవరకూ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చోటు కల్పించలేదన్నారు. రాజకీయ నేతలు ఎన్నికల ముందు వాల్మీకులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారే తప్ప తమ సమస్యలను పరిష్కరించలేదని వాపోయారు. దీంతో వాల్మీకులు ఉద్యోగ, రాజకీయ, విద్యా, ఆర్థికంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహాసేన నేతలు సుదర్శన్‌బాబు, ముత్తురాశి హరికృష్ణ, చిప్పిలి చెంద్రాయులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతపురమ్మ దేవత జాతర



అమ్మవారి ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మంచూరు గ్రామం శాకంవారిపల్లె సమీపాన వెలసిన అనంతపురమ్మ దేవత జాతర మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేకాలంకరణ, ప్రత్యేక పూజలు జరిగాయి. జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి అమ్మవారికి దీలు, బోణాలు సమర్పణ, చాందినీబండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, నేతలు కోసూరి చంద్రమౌళి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేత సురేష్‌కు ఘన నివాళి



సురేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బీసీ నేత, కరాటే మాస్టర్ ఏఆర్ సురేష్‌కు ఘన నివాళులర్పించారు. ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన ఆయనకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఇందులో సురేష్ చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. మదనపల్లె యూత్ కరాటే అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి ఎందరికో ఉచితంగా కరాటే నేర్పించడమే కాకుండా ప్రజా సేవలు అందించిన సురేష్‌కు మదనపల్లె బీసీ సంఘాల తరపున నివాళులర్పించారు. బీసీ సంఘాల నేతలు పొదల నరసింహులు, జన్నే రాజేంద్రనాయుడు, మేకల విజయ్‌మోహన్, కప్పల వేణుగోపాల్, పోతబోలు వెంకటరమణ, గంగాధర్, సుబ్రహ్మణ్యం, బసినికొండ నాయుడు పాల్గొన్నారు.

మాలతోటి నరేశ్ తొలగింపు

పీలేరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తమ అనుబంధ సంస్థ మాల విద్యార్థి సంఘం రాయలసీమ ప్రాంత అధ్యక్షుడు మాలతోటి నరేశ్‌ను తొలగిస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగంలో నరేశ్ పనిచేశాడన్నారు. ఎన్నికల అనంతరం అతన్ని తాము రాయలసీమ ప్రాంత అధ్యక్షుడిగా నియమించామన్నారు. అయితే అతను వైసీపీ ప్రభుత్వంలో అనేక భూ ఆక్రమణలు, అక్రమాలకు పాల్పడ్డాడని తెలిసిందని, ఇప్పటికీ కూడా అదే పంథా కొనసాగిస్తుండడంతో మందలించి తొలగించామన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



ఏపనైతే చేయవద్దని చెబుతామో అదేపనిని చేసేందుకు మనం ఉత్సుకతను చూపిస్తాం. ఆ పనిని ఎందుకు చేయవద్దన్నారో మనం పట్టించుకోం. వినాయకనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే 'ఇక్కడ చెత్తవేయరాదు' అన్న బోర్డు పెట్టిన చోటే ప్రజలు చెత్తను వేస్తున్నారు. భారీగా చెత్తాచెదారం పేరుకుపోవడం, పంచాయతీ అధికారులు చెత్తాచెదారాన్ని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చుట్టు పక్కల నివాసితులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంట్లో చెత్తను శుభ్రం చేసుకున్నట్లు పరిసరాలను కూడా శుభ్రపరుచుకోవాలి. - (ములకలచెరువు, ఆంధ్రజ్యోతి)

మద్యం దుకాణంలో చోరీ

కలకడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పట్టణంలోని కలకడ-గుర్రంకొండ మార్గంలోని మద్యం దుకాణాన్ని రాత్రి 10 గంటల సిబ్బంది మూసుకుని వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వేకువజామున 4.10 నిమిషాలకు దుండగులు దుకాణం పైకప్పు రేకులను కత్తిరించి లోపలికి వచ్చారు. దుకాణంలోని రూ.50 వేలు నగదు చోరీ చేసినట్లు తెలిపారు. దుకాణం నిర్వాహకుడు వెంకటరమణ నాయుడు చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ముస్తఫా హజరత్‌కు పరామర్శ

కలికిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ మైనారిటీ నేత ముస్తఫా హజరత్‌ను ఆదివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ప్రముఖ జాతీయ ముస్లిం సంస్థ జమీయత్ ఉలే మా- ఏ- హింద్‌కు ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా వున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట కలికిరి మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, నేతలు వైజాగ్ బాషా, మున్వర్ ఆలీ, మునాఫ్, లేపాక్షి అస్లామ్ తదితరులు వున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. నగరిపల్లెలో జరిగిన పంపిణీలో రూ.31 లక్షల 24 వేల 570ల చెక్కులను కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ మండలాల్లో 23 మందికి అందజేశారు. అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

మదనపల్లె సబ్ డివిజన్‌లో 144 సెక్షన్ అమలు

మదనపల్లె అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు పట్టణంలో 30 పోలీస్ యాక్ట్ అమలు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. వీధుల్లో మతపర ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని, వీటిపై ఆంక్షలు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. భక్తులు వారి ఇళ్లలో, మందిరాల్లో మాత్రమే పూజలు, ప్రార్థనలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఆంక్షలను ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోటకిందహరిజనవాడకు రోడ్డు

కూటమి ప్రభుత్వంలో మోక్షం



గతంలో ఉన్న రోడ్డు ఇలా...



నేడు కొత్తగా వేసిన సీసీ రోడ్డు

నిమ్మనపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సమీపంలోని కోటకింద హరిజనవాడకు మహర్దశ కలిగింది. 15ఏళ్లుగా ఈ గ్రామానికి రోడ్డు, మురుగునీటి కాల్వ, తాగు నీటిని సక్రమంగా అందించలేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గ్రామస్తులు అధికారులకు అర్జీలు సమర్పించినా ఫలితం కాన రాలేదు. గతంలో వర్షాలు వచ్చినప్పుడల్లా రోడ్డు చిత్తడిగా మారి జనజీవనం స్తంభించేది. కనీసం తాగునీరు పట్టుకోవాలన్నా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోటకిందహరిజనవాడ రూపురూఖలే మారిపోయాయి. స్థానిక సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప పంచాయతీ నిధులతో దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి డ్రైనేజీ, తాగునీటి కాల్వ, సీసీ రోడ్డును వేయించారు. దీంతో గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి రోడ్డు కావాలని దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో తమ సమస్యను తీర్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.